క్లుప్తంగా

పెసర పంటల పరిశీలన

ఏన్కూరు: మండలంలోని జన్నారంలో పెసర పంటలను, మిర్చి నారుమడిని వ్యవసాయాధికారి నర్సింహారావు బుధవారం పరిశీలించి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు.. మిర్చి నారును ఎత్తుగా ఏర్పాటు చేయాలన్నారు. అధిక వర్షాల వలన అక్కడక్కడ ఆకులు పసుపు రంగులోకి మారడం మరియు చనిపోవడం జరుగుతుందని, దీని నివారణకు 19-19-19 లేదా మల్టీకే పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ నవ్య, రైతులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఏన్కూరు: స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులకు ఆహ్వానం పలుకుతున్నట్లు ప్రత్యేకాధికారి లావణ్య కోరారు. పీజీసీఆర్టీ -సివిక్స్, సీఆర్టీ-బయోసైన్స్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని.. పీజీ మరియు బీఈడీ పూర్తి చేసిన అభ్యర్థులు ఆగస్టు 2లోగా విద్యాపత్రాలతో స్థానిక కస్తూర్బాలో సంప్రదించాల్సిందిగా కోరుతున్నారు.

వైఎస్ జగన్‌ను కలిసిన ప్రసన్న కుమార్‌రెడ్డి



వైఎస్ జగన్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ప్రసన్నకుమార్‌రెడ్డి

వేంసూరు: మండల పరిధిలోని ఆడసర్ల పాడు గ్రామానికి చెందిన అట్లూరి ప్రసన్న కుమార్ రెడ్డి బుధవారం ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని తాడేపల్లిలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

మంత్రిని కలిసిన ఎమ్మెల్యే

సత్తుపల్లిరూరల్: రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని హైదరాబాద్‌లో బుధవారం సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ కలిసి నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించి నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్ పాల్గొన్నారు.

'దోమలపై యుద్ధం మా సంకల్పం'

తల్లాడ: దోమలపై యుద్ధం చేయడమే మా సంకల్పమని ఖమ్మం జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి చందునాయక్ అన్నారు. మండలంలోని నారాయణపురంలో బుధవారం పలు గృహాలను సందర్శించి నీటి నిల్వల ప్రాంతంలో ఆయిల్ బాల్ వేశారు. టీమోఫస్ ద్రావణం పిచికారీ చేశారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి రత్నమనోహర్, ఎంపీడీఓ సురేష్‌బాబు, ఈఓ కృష్ణారావు, డాక్టర్ మహేశ్వర్ రావు, సూపర్‌వైజర్ పెద్ద పుల్లయ్య, భద్రమ్మ, మరియమ్మ, కళ్యాణి పాల్గొన్నారు.





జేవీఆర్ డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాటు అవుతున్న ఎగ్జిబిషన్

జేవీఆర్ గ్రౌండ్‌లో ఎగ్జిబిషన్‌పై.. అభ్యంతరం..

- పక్కనే బాలికల కళాశాల హాస్టల్, కాలేజీ
- నిత్యం వందలాది మంది వాకింగ్

సత్తుపల్లి: సత్తుపల్లి జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రౌండ్‌లో ఎగ్జిబిషన్ ఏర్పాటుపై అభ్యంతరాలు వ్యక్తమౌతున్నాయి. పక్కనే బాలికల హాస్టల్, మహిళా జూనియర్ కళాశాల ఉండటం.. ఉదయం, సాయంత్రం వేళల్లో నిత్యం వందలాది మంది శారీరక ధృడత్వం కోసం వాకింగ్ చేస్తుంటారు.. ఓపెన్ జిమ్, క్రికెట్ పిచ్ కూడా ఉంది. యువకులు క్రికెట్ ప్రాక్టీస్ చేయటం, పోటీలు జరుగుతుంటాయి. ఇంత మందికి ఉపయోగపడే డిగ్రీ కళాశాల గ్రౌండ్‌లో ఎగ్జిబిషన్ పెట్టడంపై పలువురు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఇకపోతే కళాశాల పక్కనే ఉన్న హాస్టల్‌లో రాత్రి పొద్దుపోయే వరకు ఎగ్జిబిషన్ పాటలు, ఆటల వల్ల చదువులకు ఇబ్బందితో పాటు.. ఆకతాయిలకు అవకాశం ఏర్పడుతుందనే ఆందోళన వ్యక్తమౌతుంది. రోజుకు రూ.2వేలు చొప్పున 45 రోజులకు అద్దె చెల్లించే ఒప్పందంపై మైదానం అద్దెకు ఇచ్చినట్లు సమాచారం.

తొలి సంధ్యవేళ నుంచి..

సత్తుపల్లి జేవీఆర్ డిగ్రీ కళాశాలలో వాకింగ్ చేయటం గత 40ఏళ్లుగా ఆనవాయితీగా వస్తుంది. తొలి సంధ్యవేళ నుంచి సూర్య అస్తమయం వరకు వాకింగ్ చేస్తుంటారు. రూ.8 లక్షలు వ్యయంతో వాకింగ్ ట్రాక్‌ను గ్రౌండ్ చుట్టూ నిర్మించారు. రూ.5 లక్షలతో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు. మరో రూ.5 లక్షలతో క్రికెట్ పిచ్‌ను ఏర్పాటు చేసి క్రీడాకారులు ప్రాక్టీస్ చేస్తుంటారు. ఇకపోతే హాస్టల్‌లో కళాశాల విద్యార్థినులకు మంచి పరిసరాలు ఉండటంతో చదువుకునేందుకు వీలుగా ఉంటుంది.

కాలకృత్యాలు, వ్యర్థాలతో..

ఎగ్జిబిషన్ ఏర్పాటుతో అందులో పని చేసే సుమారు 100మందికి కాలకృత్యాలకు చుట్టు పక్కల ఉన్న పరిసరాలు అపరిశుభ్రంగా తయారవుతాయని ఆందోళన వ్యక్తమౌతుంది. దీంతో పాటు వ్యర్థాలను వేయటం వలన వాకింగ్ చేయటం కుదరనిపని అని వాపోతున్నారు. ఇకపోతే ఎగ్జిబిషన్ చూసేందుకు వచ్చే వందలాది మందికి డంపింగ్‌యార్డ్‌గా మారుతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీనికితోడు పార్కింగ్ సౌకర్యం లేకపోవటంతో ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలపటం వల్ల సమస్యలు ఉత్పన్నమౌతాయని పలువురు నిరసన వ్యక్తం చేస్తున్నారు.



గ్రౌండ్‌లో వాకింగ్ చేస్తున్న వాకర్స్

ఎగ్జిబిషన్‌కు అనుమతి ఇచ్చాం..



కళాశాల గ్రౌండ్‌లో ఎగ్జిబిషన్ ఏర్పాటు వల్ల కళాశాలకు ఆదాయం వస్తుంది. సభలకు, సమావేశాలకు ఎన్నాళ్ల నుంచో అనుమతులు ఇస్తూనే ఉన్నాం. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచమని చెప్పాం. వాస్తవానికి డిగ్రీ కళాశాల మైదానంలో వాకింగ్‌కు ఎటువంటి అనుమతులు లేవు.

– డాక్టర్ ఎస్.గోపి, జేవీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, సత్తుపల్లి

వాకింగ్ చేయలేం..



సత్తుపల్లి జేవీఆర్ డిగ్రీ కళాశాలలో కొన్నేళ్లుగా వాకింగ్ చేస్తున్నాం. చక్కటి వాతావరణం, పచ్చని చెట్ల మధ్య వాకింగ్ చేస్తుంటే ఆహ్లాదంతో పాటు ఆరోగ్యం లభిస్తుంది. ఎగ్జిబిషన్ వల్ల పరిసరాలు అపరిశుభ్రంగా మారి ముక్కుమూసుకొని నడవాల్సిన పరిస్థితి ఉంది.

– దామెర రమేష్, వాకర్, సత్తుపల్లి

ఏకగ్రీవ గ్రామ పంచాయతీలకు కృషి చేయాలి



మధిర: మాట్లాడుతున్న మల్లు నందిని

మధిర/బోనకల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో నియోజకవర్గంలోని గ్రామ పంచాయతీలన్నీ ఏకగ్రీవం చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలని మల్లు నందిని పేర్కొన్నారు. బుధవారం మధిరలోని మాటూరుపేటలో, బోనకల్‌లోని జానకీపురంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. స్థానిక ఎన్నికల్లో సమరశంఖను పూరించారు. నియోజకవర్గానికి 18నెలలుగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేస్తున్న అభివృద్ధిని ప్రజలకు వివరించాలన్నారు. వంగవీడులో రూ.600కోట్లతో నిర్మించనున్న లిఫ్ట్ ఇరిగేషన్‌తో ఎర్రుపాలెం మండలంలోని ప్రతీ ఎకరాకు నీరు అందుతుందన్నారు. అన్ని గ్రామాలకు రోడ్లు, అర్హులందరికీ రేషన్‌కార్డులు మంజూరు చేశామని, అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్‌ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర నాయకుడు సత్యనారాయణ, జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాసరెడ్డి, మండల అధ్యక్షులు కిషోర్, శ్రీనివాసరెడ్డి, దుర్గారావు, నాగేశ్వరరావు, ప్రమీల, రమాదేవి, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై పాడి గేదెలు

ముదిగొండ: మహిళా సమాఖ్య ఇందిరా డైరీ లబ్ధిదారులకు రాయితీపై పాడి గేదెలు ఇవ్వనున్నట్లు మండల స్పెషల్ ఆఫీసర్ విజయలక్ష్మి అన్నారు. బుధవారం ముదిగొండలోని ఐకేపీ కార్యాలయంలో నిర్వహించన సమావేశంలో ఎస్సీ లబ్ధిదారులైన డ్వాక్రా మహిళలకు ఇందిరా డైరీ పథకం ద్వారా 2గేదెలు 80శాతం రాయితీపై ఇవ్వనున్నట్లు తెలిపారు. ముదిగొండ మండలంలో 25మంది లబ్ధిదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి, పశువైద్యాధికారులు రమేష్, అశోక్, ఐకేపీ సీసీలు అనురాధ, వెంకటరామారావు, నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న స్పెషల్ ఆఫీసర్ విజయలక్ష్మి

ఇంటి నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి



మాట్లాడుతున్న డీపీఓ ఆశాలత

బోనకల్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని డీపీఓ ఆశాలత సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం బోనకల్, చింతకాని మండలాల కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలలో దశల వారీగా ఫొటోలు అప్‌లోడ్ చేయాలన్నారు. పారిశుద్ధ్య పనులు సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ ఆర్. రమాదేవి, ఎంపీఓ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉద్యోగి 'వనం' ఉద్యోగ విరమణ నేడు..



వెంకట నాగేశ్వరరావు

ముదిగొండ: బీఎస్ఎన్ఎల్‌లో 30 ఏళ్ల పాటు విధులు నిర్వర్తించిన వనం వెంకట నాగేశ్వరరావు గురువారం ఉద్యోగ విరమణ చేయనున్నారు. డెయిలీ కాంట్రాక్టు లేబర్‌గా ఉద్యోగం ఆరంభించిన ఆయన ఇంజనీర్ కేడర్‌కు చేరారు. ముదిగొండ మండలం వనం వారి కృష్ణాపురానికి చెందిన నాగేశ్వరరావు వేల టెలిఫోన్ కనెక్షన్లు ఇవ్వడమే కాక పోటీ నెట్‌వర్క్‌కు బదులు బీఎస్ఎన్ఎల్ ప్రయోజనాలకు ఇంటింటా వివరించేవారు. సర్వీస్ లో పలు అవార్డులు అందుకున్న నాగేశ్వరరావు ఉద్యోగ విరమణ సన్మాన సభ గురువారం జరగనుండగా బీఎస్ఎన్ఎల్ ఉద్యోగ సంఘాల నాయకులు పలువురు హాజరు కానున్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



ఏన్కూరు: విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న తహసీల్దార్ శేషగిరిరావు

వైరా/ కొణిజర్ల/ ఏన్కూరు/ సత్తుపల్లిటౌన్/ ఎర్రుపాలెం: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని వైరా, సత్తుపల్లి మున్సిపల్ కమిషనర్లు చింతా వేణు, నర్సింహా, ఎంపీడీఓ ఆర్.ఉపేంద్రయ్య, తహసీల్దార్ సీహెచ్.శేషగిరిరావు, ఎంఈఓ మురళీమోహన్‌రావు తెలిపారు. వైరాలోని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలను, కొణిజర్లలోని అమ్మపాలెం జీపీలోని మహాత్మాజ్యోతీబా పూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలను, ఏన్కూరు మండలంలోని మర్సకుంట ప్రాథమిక పాఠశాలను, సత్తుపల్లి పట్టణంలోని ఎస్టీ బాలికల హాస్టల్‌ను, ఎర్రుపాలెం మండలంలోని బనిగండ్లపాడు గ్రామంలోని ఎస్సీ హాస్టల్‌ను వారు సందర్శించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. డార్మెటరీ, కిచెన్, పరిశీలించారు. విద్యార్థులకు వండి పెడుతున్న సామాన్లు పరిశీలించారు. కార్యక్రమాలల్లో వైరా ఎస్సై రామారావు, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ నాగేశ్వరరావు, ప్రిన్సిపాళ్లు నాగమణి, సమత, డిప్యూటీ వార్డెన్లు నిర్మల, తులసి, హాస్టల్ వార్డెన్ మాధవి తదితరులు పాల్గొన్నారు.

'ప్రత్యామ్నాయం చూపి.. పనులు చేయండి'



జేసీబీలను అడ్డుకున్న పోడుదారులు, సముదాయిస్తున్న పోలీసులు, ఫారెస్టు అధికారులు

కారేపల్లి: మండలంలోని కారేపల్లి ఫారెస్టు రేంజ్ పరిధి మాణిక్యారం, ఎర్రబోడు పోడు ప్లాంటేషన్‌లో ఖమ్మం రూరల్ ఏసీపీ పరిధిలోని పోలీసు సిబ్బంది, ఖమ్మం సబ్ డివిజన్ పరిధిలోని ఫారెస్టు అధికారులు భారీ బందోబస్తుల నడుమ జేసీబీలతో ట్రెంచ్ వేస్తున్న సంగతి తెలిసిందే. కాగా, బుధవారం 9 జేసీబీలతో పోలీస్, ఫారెస్ట్ అధికారుల ట్రెంచ్ కొట్టే పనులు చేపడుతుండగా బాధిత పోడుదారులు జేసీబీలను అడ్డుకుని, 'ప్రత్యామ్నాయంగా పోడు భూమి చూయించిన తర్వాతనే పనులు చేపట్టాలని'పట్టుపట్టారు. దీంతో సింగరేణి సీఐ తిరుపతిరెడ్డి, కారేపల్లి, కామేపల్లి ఎస్ఐలు, ఫారెస్టు అధికారులు పోడుదారులను సముదాయించే ప్రయత్నం చేయగా.. పోడుదారులు మాట్లాడుతూ.. ఏళ్లుగా పోడు వ్యవసాయం చేసుకుని జీవిస్తున్న మాకు, ప్రత్యామ్నాయం చూపిస్తామని పోడు తీసుకుని అడిగితే అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తారా, మాలాంటి పేదోళ్లను అధికారులు మాయమాటలతో మోసం చేయటం ఎంత వరకు సబబు అని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ని కేసులు పెట్టినా, ఎన్ని నిర్బంధాలు విధించినా పోడు వదులుకునే ప్రసక్తే లేదని భీష్మించగా.. ఘటనా స్థలానికి చేరుకున్న ఎఫ్‌డీఓ వెంకన్న నాయక్ పోడుదారులతో మాట్లాడారు. పోడుదారుల సమస్యల పై ఖమ్మం ఫారెస్ట్ కార్యాలయంలో చర్చిద్దామని, జేసీబీలను వదిలివేయాలని, రెండు రోజుల తర్వాత సమస్యపై చర్చించుకుందామని పేర్కొన్నారు. ఎఫ్‌డీఓ హామీ మేరకు పోడుదారులు ఆందోళనను విరమించారు.

నిరుపేదల కలలు నెరవేరుస్తున్న ప్రభుత్వం



శంకుస్థాపన చేస్తున్న పువ్వాళ్ల దుర్గా ప్రసాద్

వైరా: కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన ప్రతి నిరుపేదకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి రూ.5 లక్షలు సాయం చేస్తూ నిరుపేదల సొంతింటి కలను నిజం చేస్తుందని డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్ అన్నారు. వైరా మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీలలో ఇందిరమ్మ ఇండ్ల శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన పీసీసీ ప్రధాన కార్యదర్శి నూతి సత్యనారాయణతో కలిసి పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు హరినాథ్, వీరభద్రం, శేఖర్ గౌడ్, సౌజన్య, గంగారావు, కొండలు, శ్రీను, అశోక్, చంద్రశేఖరరెడ్డి, రమేష్, రాజు, గోపి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



హెచ్‌ఎంను సన్మానిస్తున్న దృశ్యం

చింతకాని: ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని నాగులవంచలో హెచ్‌ఎం ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలపై కలిసి వచ్చే సంఘాలతో యూఎస్‌పీసీ ఆధ్వర్యంలో ఆగస్టు 5న జిల్లా కేంద్రాల్లో, 23న రాష్ట్రంలో ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ మండల బాధ్యులు శ్రీనివాసరావు, రమణ, నాగేశ్వరరావు, కేశవులు, రత్నం, లక్ష్మీ, విజయ, సుజాత, శైలజ, హనుమంతురావు పాల్గొన్నారు.

పాఠశాలకు విధిగా హాజరుకావాలి

ఎర్రుపాలెం: విద్యార్థులు పాఠశాలకు విధిగా హాజరుకావాలని హెచ్‌ఎం వెల్లంకి నాగరాజు అన్నారు. బుధవారం మండలంలోని వెంకటాపురంలోని ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

రూ.12 లక్షల నిధులు మంజూరు

వైరారూరల్: మండలంలోని తాటిపూడి గ్రామంలోని యూపీఎస్‌లో నూతన అంగన్‌వాడీ భవన నిర్మాణానికై ఈజీఎస్ పథకం నుంచి రూ.8 లక్షలు, జెడ్పీ నుంచి రూ.2 లక్షలు, అంగన్‌వాడీల నుండి రూ.2 లక్షలు మొత్తం రూ.12లక్షల నిధులు మంజూరు అయ్యాయి. కాగా బుధవారం పంచాయతీ రాజ్ డీఈ వెంకటేశ్వరరావు భవన నిర్మాణానికి ముగ్గులు పోయించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఏఈ ప్రదీప్, కాంగ్రెస్ నాయకులు నాగరాజు, నిర్మల, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు ఆరోపణలు సరికాదు

కల్లూరు: తమది కాని భూమి తమదేనని తప్పుడు ఆరోపణలు చేస్తున్న రవికుమార్ దంపతులపై చర్యలు తీసుకోవాలని ఆంజనేయరాజు అన్నారు. వివరాల ప్రకారం.. తాను చంద్రుపట్ల, పేరువంచ రెవెన్యూ పరిధిలో 13 కుంటలు మరియు 1.01 ఎకరం చొప్పున 2014లో మానాల రవికుమార్, యశోద కల్యాణి దంపతుల వద్ద నుంచి రిజిస్ట్రేషన్ ద్వారా కొనుగోలు చేశానని, వీటి ద్వారా 10 సంవత్సరాలుగా రైతుబంధు, భరోసా నగదు తీసుకుంటున్నాని, 6 ఏళ్ల కిత్రం కాపులోన్ కూడా తీసుకున్నాని పేర్కొన్నారు. శనివారం 13 కుంటల భూమిలో ముదురు రెండు చెట్లు ఉంటే నరికివేశానన్నారు. ఇటీవల భూమికి రేట్లు పెరగడంతో దురుద్దేశంతో ఇలా చేస్తున్నారన్నారు. ఈమేరకు బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆంజనేయరాజు విలేకరులకు తెలిపారు.

మహిళా గురుకులంలో రోబోటిక్స్‌పై వర్క్‌షాప్

కొణిజర్ల: మండలంలోని తనికెళ్లలో గల తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో బుధవారం రోబోటిక్స్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. కళాశాల ఐక్యూఏసీ, సీజీసీ కోఆర్డినేటర్‌ల ఆధ్వర్యంలో కంప్యూటర్ సైన్స్, ఫిజికల్ సైన్స్ విభాగం వారు ఏర్పాటు చేసిన ఈ వర్క్‌షాప్‌కు రిసోర్స్ పర్సన్‌లుగా పావని, వైష్ణవిలు బాలికలకు రోబోటిక్స్ గురించి వివరించారు. ఆధునిక సాంకేతికను బాలికలు అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రజని, వైస్ ప్రిన్సిపాల్ నవ్య, కోఆర్డినేటర్లు కేపీ ఐశ్వర్య, దీప్తి, పాల్గొన్నారు.

ఫోర్జరీ సంతకాలతో పాసు పుస్తకం ఇచ్చారని రైతు ఆవేదన

బోనకల్: రెవెన్యూ అధికారులు ఫోర్జరీ సంతకాలతో పాసుపుస్తకం ఇచ్చారని బాధిత రైతు తన కుటుంబ సభ్యులతో బుధవారం తహసీల్ ఎదుట విలేకరు సమావేశం నిర్వహించారు. మండలంలోని ముష్టికుంట్ల గ్రామానికి చెందిన వంగాల గోపయ్యకు ఇద్దరు భార్యలు, ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. ముష్టికుంట్ల రెవెన్యూ పరిధిలో గల 279 సర్వే నంబర్‌లో 1.13 కుంటల భూమి ఉంది. ముగ్గురు కుమార్తెలకు వివాహం కావడంతో మిగిలిన ఇద్దరు కుమారులు వంగాల నాగేశ్వరరావు, వంగాల కొండలరావులు సమానంగా పంచుకోవాల్సి ఉంది. ఐనప్పటికీ ఫోర్జరీ సంతకాలతో వంగాల నాగేశ్వరరావు సహకారంతో సోదరి ఎర్రగాని లక్ష్మీ పాసు పుస్తకం తీసుకుంది. రెవెన్యూ అధికారులు అన్నదమ్ములు సమానంగా పంచుకోవాల్సిన భూమిని ఏకపక్షంగా సోదరికి చేశారని ఆరోపించారు. ఈ విషయంపై తహసీల్దార్ రమాదేవిని వివరణ కోరగా.. నిబంధనల మేరకు పాసుపుస్తకం చేశామని, అభ్యంతరాలు ఉంటే ఆర్డీఓ కోర్టుకు వెళ్లాలని తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

బోనకల్: ఆంధ్రా నుంచి తెలంగాణ ప్రాంతానికి అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను బుధవారం బోనకల్ పోలీసులు సీజ్ చేశారు. ఎన్టీఆర్ జిల్లా వత్సవాయి నుంచి బోనకల్ మండలం గోవిందాపురం(ఎ) గ్రామం మీదుగా ఇసుకను తరలిస్తుండగా వత్సవాయి పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఇసుక ట్రాక్టర్ల అక్రమార్కులకు, పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వివాదం జరిగింది. ఈ క్రమంలో బోనకల్ పోలీసులు రంగ ప్రవేశం చేసి ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. విచారణ అనంతరం కేసు నమోదు చేయనున్నట్లు ఎస్ఐ పొదిలి వెంకన్న తెలిపారు.

చోరీ కేసులో ముగ్గురి అరెస్ట్

సత్తుపల్లి: చోరీ కేసులో ముగ్గురు దొంగలను సత్తుపల్లి పోలీసులు అరెస్ట్ చేసిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. సత్తుపల్లి పట్టణ సీఐ తుమ్మలపల్లి శ్రీహరి తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీ మెట్ట ఆంజనేయస్వామి వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానస్పదంగా తిరుగుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. సత్తుపల్లికి చెందిన కందుకూరి సోమాచారి, మారోజు సూర్యప్రకాశ్, కందుకూరి రత్నగిరిలను అదుపులోకి తీసుకుని వారి వద్ద 21.5 గ్రాముల బంగారం ముద్ద, 200 గ్రాముల వెండి వస్తువులు, రెండు సెల్‌ఫోన్లు, రూ.9,400 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దొంగలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

ముగ్గురిపై కేసు నమోదు

చింతకాని: మండలంలోని బస్వాపురం గ్రామానికి చెందిన ఆవుల కోటేశ్వరరావు, దూదిమళ్ల నాగేశ్వరరావు, మన్మథరావు వ్యక్తులపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బండారు రామకృష్ణ వ్యవసాయ భూమిలోనికి అక్రమంగా ప్రవేశించి ఫెన్సింగ్ రాళ్లను ఏర్పాటు చేస్తుండగా అదేమిటని ప్రశ్నించగా.. రామకృష్ణను కొట్టి చంపుతామని బెదిరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్ఐ నాగుల్‌మీరా ముగ్గురిపే కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

తల్లాడ: మండలంలోని నూతనకల్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం అగ్ని ప్రమాదాలపై వైరా అగ్నిమాపక దళం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఇంటి వద్ద గ్యాస్ లీకైనప్పుడు విద్యుత్ సంబందిత స్విచ్‌లు వేయరాదన్నారు. గ్యాస్ లీకై వాసన వస్తుంటే అన్ని తలుపులను, కిటికీలను తెరిచి ఉంచాలని, గ్యాస్ లీకై మంటలు వస్తుంటే ఒక ఖాళీ బకెట్‌ను పూర్తిగా దానిపై బోర్లించి మంట ఆరిపోగానే రెగ్యులేటర్ నాజ్‌నుబంద చేసి మంటలు నివారించే విధానాన్ని పత్యక్షంగా వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎస్.దామోదరప్రసాద్, నూతనకల్ పాఠశాల హెచ్‌ఎం రమేష్ పాల్గొన్నారు.

గ్రామంలో ఇంటర్ పోల్స్ నిర్మాణం

ముదిగొండ: మండలంలోని న్యూలక్ష్మీపురంలో విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఇంటర్ పోల్స్‌ను అమర్చారు. విద్యుత్‌శాఖ ఏడీఈ రామకృష్ణారావు, ఏఈ మేకపోతుల శ్రీనివాస్ గ్రామంలో ఇళ్లపై ఉన్న తీగలు, కిందకు వంగిన లైన్లకు మరమ్మతులు చేయించి, కొత్త స్తంభాలను అమర్చారు. గ్రామంలో ఎల్‌టీ లైన్స్ వేసి కొత్త ఇళ్లకు విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు కన్నయ్య, ఎండీ అజ్గర్ పాల్గొన్నారు.

5న ఇసుక వేలం పాట

తల్లాడ: ఖమ్మం మెయిన్ రోడ్‌లో మండల మహిళా సమాఖ్య శంకుస్థాపన దిమ్మె వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుకను వచ్చే నెల 5న బహిరంగ వేలం పాట వేయనున్నట్లు తల్లాడ తహసీల్దార్ సురేష్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల పోలీసులు నారాయణపురంలో పట్టుకున్న నిల్వ ఉన్న 8ట్రాక్టర్ల ఇసుకను వేలం వేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం క్యూబిక్ మీటరుకు రూ.642 ధర నిర్ణయించిందని, వేలంలో పాల్గొనేవారు రూ.5 వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు.

కవిత ఆస్పత్రిలో అరుదైన ఆపరేషన్

వైరా: వైరాలోని కవిత ఆస్పత్రిలో బుధవారం అరుదైన ఆపరేషన్ నిర్వహించి మహిళ కడుపులో నుంచి 10 కేజీల కణితిని తొలగించారు. వైరా మున్సిపాలిటీ పరిధిలోని దిద్దుపూడి గ్రామానికి చెందిన కొత్తపల్లి మరియమ్మ కొన్ని రోజులుగా తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతూ వైరా బస్టాండ్ సమీపంలోని కవిత ఆస్పత్రిలో చేరింది. పరీక్షలు చేసిన వైద్యురాలు కవిత మరియమ్మ కడుపులో కణితి ఉన్నట్లు గుర్తించారు. బుధవారం శస్త్రచికిత్స నిర్వహించి 10 కేజీల కణితిని తొలగించారు.

వైద్య శిబిరం

కారేపల్లి: మండలంలోని బోటితండా గ్రామంలో వైద్యశాఖ ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. చీమలపాడు ఉప ఆరోగ్య కేంద్రం ఎంఎల్‌హెచ్ కల్యాణి రక్త నమూనాలను సేకరించి.. మందులు అందించారు. ఏఎన్ఎంలు నాగమణి, ఉష పాల్గొన్నారు.

యూరియా అందించాలి

కొణిజర్ల: ఎవరి పట్టాదారు పాస్‌పుస్తకం వారే తీసుకుని రావాలని, మొదట ఎవరు వస్తే వారికే సొసైటీలో ఉన్న యూరియా అందుతుందని బుధవారం వ్యావసాయ శాఖ నుంచి రైతులకు వాట్సాప్ సమాచారం పంపించారు. దీంతో రైతులు.. పట్టాదారులు ఇతర ప్రాంతాల్లో స్థిరపడగా, మాకు కావాల్సిన యూరియా కోసం వాళ్లని ఏలా తీసుకురావాలని అంటుంటే.. మరికొందరు పట్టా పుస్తకాలు కొడుకులు, భార్యల పేరుమీద ఉంటే వారిని కూడా క్యూలో నిలబెట్టాలా అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆర్థిక సాయం..

పాత్రికేయుడి కుటుంబానికి..

చింతకాని: మండలంలోని ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన పాత్రికేయుడు చేబ్రోలు ఇంద్రసేన కుటుంబానికి టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు ఏనుగు వెంకటేశ్వరరావు బుధవారం ఆర్థిక సహాయాన్ని అందించారు. ఇంద్రసేన భార్య వీరకుమారి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ప్రజాపక్షం పేపరులో పనిచేస్తున్న పాత్రికేయ మిత్రుల ద్వారా సేకరించిన రూ.21 వేల నగదుతో పాటు 50 కేజీల బియ్యాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు మల్లికార్జున్‌రావు, మండల కార్యదర్శి గోపాలరావు, పాత్రికేయులు ప్రసాద్, కృష్ణార్జునరావు, శ్రావణ్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి సహకరించండి

కారేపల్లి: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలని సింగరేణి మండల విద్యాశాఖ అధికారి దుగ్గిరాల జయరాజు అన్నారు. బుధవారం మండలంలోని ముత్యాలగూడెం ప్రాథమి పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో.. అదే గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయ దంపతులు పాయం పాపారావు, పల్లవి పాఠశాలకు ఒక టేబుల్, 4 కుర్చీలు వితరణగా అందజేశారు. ఉపాధ్యాయులై ఉండి కూడా వారి పిల్లలను స్థానిక పాఠశాలలోనే చదివించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం శారద, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, జయ, పేరెంట్స్ కమిటీ చైర్మన్ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

స్కూల్ బ్యాగులు పంపిణీ

సత్తుపల్లిరూరల్: మండలంలోని సత్తుపల్లి, బాసారం గ్రామాల్లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు యువ భారత్ శక్తి ఫౌండేషన్ వారు స్కూల్ బ్యాగులను బుధవారం అందించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ నిర్వాహకుడు మాట్లాడుతూ.. విద్యార్థులకు బ్యాగులు అందించడానికి సాయంచేసిన ప్రతీ ఒక్క దాతకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో యువ భారత్‌శక్తి ఫౌండేషన్ సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు అబ్దుల్ పాల్గొన్నారు.

పాఠశాలలో గ్రిల్ ఏర్పాటుకు వితరణ

ఎర్రుపాలెం: మండలంలోని మీనవోలు జెడ్పీ ఉన్నత పాఠశాల తరగది గదుల్లోకి కోతులు రాకుండా భీమవరం గ్రామానికి చెందిన దాత, కాంగ్రెస్ నాయకుడు యరమల పూర్ణచంద్రారెడ్డి రూ.60వేలతో పాఠశాలకు గ్రిల్స్ ఏర్పాటు చేశారు. దీంతో దాతను హెచ్‌ఎం బి.మురళీమోహన్‌రావు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

శ్రీగణేష్ ఆలయ నిర్మాణానికి రూ.5.16 లక్షలు వితరణ



విరాళం అందిస్తున్న కంచర్ల సత్యనారాయణ

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లిలోని శ్రీప్రసన్నగణపతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన నిర్మించే శ్రీగణేష్ ఆలయ నిర్మాణానికి పట్టణానికి చెందిన కంచర్ల సత్యనారాయణ బుధవారం రూ.5,16,116లు ఆలయ కమిటీ నిర్వాహకులకు వితరణగా అందించారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటీ చైర్మన్ నాయుడు వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి రవిరాజు, విరాళాల సేకరణ అధ్యక్షుడు బోనగిరి చెన్నారావు, మిట్టపల్లి గంగా పాల్గొన్నారు.

జేఎస్సార్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దుస్తులు

కల్లూరు: జేఎస్ఆర్ ట్రస్ట్ అధినేత జాస్తి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం మున్సిపాలిటీ కార్మికులకు, కల్లూరు అంబేడ్కర్ నగర్, కప్పలబంధం గ్రామంలోని నిరుపేదలు, వృద్ధులు, మహిళలు 250మందికి రూ. 1.30 లక్షల విలువైన దుస్తులు పంపిణీ చేశారు. కల్లూరు ఎస్ఎస్‌పీ క్యాంప్‌లోని ప్రాథమిక పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం రూ.20 వేల విలువైన మంచినటీ వాటర్ ఫిల్టర్‌ను ఏర్పాటు చేశారు. విద్యార్థులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ నాగేశ్వరరావు, రిటైర్డ్ ఎంఈఓ రంగారావు, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు, బ్రెడ్ అందజేత

వైరా: లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ లయన్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కోఆర్డినేటర్ ఘట్టమనేని బాబూరావు జన్మదినాన్ని పురస్కరించుకుని బుధవారం వైరాలోని మురళీ కృష్ణ ఆస్పత్రిలోని 25మంది ఇన్ పేషెంట్లకు బ్రెడ్, పండ్లు వితరణ చేశారు. ఈ సందర్భంగా వైరా లయన్స్‌క్లబ్ అధ్యక్షులు వై.బుచ్చిరామారావు, జాల పుల్లారావులను పీడీజీ డాక్టర్ కాపా మురళీ కృష్ణ అభినందించారు. కార్యక్రమంలో లయన్ లగడపాటి ప్రభాకర్‌రావు, నాగేశ్వరరావు, ఉండ్రు శ్యాంబాబు, నీరజ, రాంబాబు, కృష్ణమూర్తి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.